
నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 3 ఏప్రిల్ 2024 | VIKARABAD

## నీటి ఎద్దడి నివారణకు..

### కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ నం.9347492260 ఏర్పాటు



రంగారెడ్డి, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఎక్కడైనా నీటి ఎద్దడి నెలకొంటే సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో కాల్ సెంటర్ నం.9347492260ను ఏర్పాటు చేసినట్లు రంగారెడ్డి కలెక్టర్ శశాంక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలు, తండాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే కాల్ సెంటర్ నంబర్‌కు ఫోన్ ద్వారా గానీ.. వాట్సాప్ ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. నీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, డివిజన్ పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు కలెక్టర్ చెప్పారు.

## నేడు వికారాబాద్‌కు కేటీఆర్ రాక



వికారాబాద్, ఏప్రిల్ 2 : వికారాబాద్‌లోని గౌలికర్ ఫంక్షన్‌హాలులో నేడు జరిగే నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని సీనియర్ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## తాగునీటి ఎద్దడిని అధిగమించేలా..

### వికారాబాద్ జిల్లాలో తాగునీటి సరఫరా కోసం రూ.9.22 కోట్లు మంజూరు

### అందులో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ నిధులు రూ.3 కోట్లు .. ఎస్‌డీఎఫ్ నిధులు 6.22 కోట్లు

బొంరాస్‌పేట, ఏప్రిల్ 2 : వికారాబాద్ జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేక నిధులను మంజూరు చేసింది. గతే డాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోతు న్నాయి. రానున్న రోజుల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఏవైనా అవాంతరాలు ఏర్పడి తే దానిని అధిగమించేందుకు.. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం జిల్లాకు 9.22 కోట్లు మంజూరు చేసింది. వీటిలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ నిధులు రూ.3 కోట్లు కాగా, ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్) రూ.6.22 కోట్లు ఉన్నాయి. ఈ నిధుల తో పంపుసెట్లు, ప్యానల్ బోర్డులు, చేతిపంపులకు మరమ్మతులు, మిషన్ భగీరథ పథకం లో వేసిన పైపులైన్లు పగిలితే రిపేర్లు చేయడం, లీకేజీలను అరికట్టడం, సింగిల్‌ఫేస్, త్రీ ఫే స్ విద్యుత్ మోటర్లకు మరమ్మతులు వంటి తదితర పనులను చేపట్టాల్సి ఉంటుంది. అవసరమైతే వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకుని ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలోని 20 మండలాల్లో 776 పనులను అధికారులు గుర్తించారు. వీటికోసం రూ.3 కోట్లు ఖర్చు చేయనున్నారు.

### మండలాల వారీగా మంజూరైన నిధులు



దుద్యాల మండలంలోని నాస్కంపల్లిలో చేతి పంపునకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది


తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లాలోని 20 మండలాలకు మంజూరైన నిధుల వివరాలు ఇలా ఉన్నాయి. ధారూరు మండలంలో 42 పనులకు రూ.16.27 లక్షలు, మోమిన్‌పేట లో 27 పనులకు రూ.9.40లక్షలు, మర్పల్లిలో 29 పనులకు 12.51లక్షలు, నవాబు పే టలో 27పనులకు 13.90 లక్షలు, వికారాబాద్‌లో 21 పనులకు రూ.10.60లక్షలు, పరిగిలో 46 పనులకు రూ.17.15లక్షలు, పూడూరులో 38 పనులకు రూ.17.60లక్ష లు, కోట్‌పల్లిలో 21 పనులకు రూ.13.25 లక్షలు, బంట్వారంలో 14 పనులకు రూ.11. 60 లక్షలు, యాలాలలో 50 పనులకు రూ.17.70లక్షలు, పెద్దేముల్‌లో 48 పనులకు రూ.17.65లక్షలు, కొడంగల్‌లో 34 పనులకు రూ.16.21లక్షలు, దౌల్తాబాద్‌లో 50 పనులకు రూ.15.74లక్షలు, దుద్యాలలో 42పనులకు 12.66లక్షలు, బొంరాస్‌పేటలో 75 పనులకు రూ.25.38 లక్షలు, బషీరాబాద్‌లో 29 పనులకు రూ.12.20 లక్షలు, తాండూరులో 42 పనులకు రూ.15.70లక్షలు, దోమలో 50 పనులకు రూ.15.25 లక్షలు, కులకచర్లలో 53 పనులకు రూ.15.10లక్షలు, చౌడాపూర్ మండలంలో 38 పనులకు రూ.14.14 లక్షలు నిధులు మంజూరయ్యాయి.

### ఎస్డీఎఫ్ నిధులు రూ.6.22 కోట్లు మంజూరు

ప్రతి నియోజకవర్గానికీ ప్రభుత్వం అభివృద్ధి పనుల నిమిత్తం రూ.10 కోట్ల చొప్పున నిధు లను మంజూరు చేసింది. ఈ నిధుల నుంచి తాగునీటి అవసరాల కోసం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 342 పనులను చేపట్టేందుకు రూ.6.22 కోట్లను మంజూరు చేసింది. కొడంగల్ నియోజవర్గానికి 134 పనులకు రూ.2.74 కోట్లు, పరిగికి 121 పనులకు రూ.98లక్షలు, తాండూరుకు 34 పనులకు రూ.కోటి, వికారాబాద్ నియోజకవ ర్గానికి 53 పనులకు రూ.1.50కోట్లను మంజూరు చేసింది. గ్రామాల్లో ఎక్క డెక్కడ మంచి నీటి సమస్యలు ఉన్నాయో గుర్తించి ఈ నిధులతో అధికారులు పనులు చేపడుతున్నారు.

### 110 రోజుల కాంగ్రెస్ పాలనలో అన్నీ వైఫల్యాలే

- రైతులు కష్టాల్లో ఉన్నా.. పాలకులకు పట్టింపేలేదు
- ఎన్నికల నాటి హామీ మేరకు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే
- ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేలు పరిహారం చెల్లించాలి
- రైతు సమస్యలపై దీక్షలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతాం
- మాజీ మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి
- రూ.500 బోనస్‌పై అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత
- హాజరైన ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి



అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీ సురభివాణీదేవి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ తదితరులు

# పార్టీ గేట్లు కాదు.. ప్రాజెక్టుల గేట్లు తెరువండి

రంగారెడ్డి, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ): ఇతర పార్టీల నేతల కోసం గేట్లు ఎత్తడం కాదు.. ప్రాజెక్టుల గేట్లు తెరిచి రైతులకు నీళ్లివ్వాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. ఎన్నికలకు ముందు రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి యాసంగి ధాన్యాన్ని కొనాలని కోరుతూ మంగళవారం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆమె కలెక్టరేట్‌కు వెళ్లి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ కరువు పరిస్థితులతో రైతులు కష్టాల్లో ఉండగా..ప్రభుత్వం బాధిత రైతులకు ధైర్యం చెప్పే ఆలోచన కూడా చేయకపోవడం సిగ్గు చేటన్నారు. పండిన ఆ కొద్దిపాటి పంటలను కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనాలని.. మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలని.. రైతుభరోసా కింద రైతులకు ఏడాదికి రూ.15 వేల సాయం అందించాలని, కౌలు రైతులకూ అదే స్థాయిలో సాయం అందించాలన్నారు. 2 లక్షల రుణమాఫీని అమలు చేయడంతో పాటు పశుగ్రాసం పంపిణీకి తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### కేసీఆర్ రైతు ఉద్యమంతో కాంగ్రెస్‌లో వణుకు..

కష్టాల్లో ఉన్న రైతులకు బాసటగా నిలిచేందుకు కేసీఆర్ రైతు ఉద్యమం ప్రారంభించడంతో కాంగ్రెస్ పాలకుల్లో వణుకు మొదలైందని సబితాఇంద్రారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం పాలనను గాలికి వదిలేసిందని, 110 రోజుల పాలనలో అన్నీ వైఫల్యాలే ఉన్నాయని విమర్శించారు. కరెంటు, నీళ్లు ఇవ్వకపోవడం ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యమేనని.. ఇది సహజంగా వచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని మండిపడ్డారు. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వక రైతులను నష్టపర్చడమేగాక కేసీఆర్‌ను బద్నాం చేయాలని కాంగ్రెస్ చూస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ ఒక్క రోజు పర్యటనతోనే భయపడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం వరద కాల్వ, సాగర్ కాల్వలకు నీటిని విడుదల చేసిందన్నారు. ఈ నీళ్లను ముందే వదిలి ఉంటే రైతులు పుష్కలంగా పంటలను పండించుకునే అవకాశం ఉండేదన్నారు. తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, కనీసం సమీక్షలు కూడా నిర్వహించడం లేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల నాటి హామీలను అమలు చేయాల్సిందేనని, రైతులను ఆదుకోకుంటే దీక్షలు, ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు.


### కేసీఆర్‌పై ఉన్న కోపం రైతులపై చూపిస్తే ఎలా..

కేసీఆర్‌పై ఉన్న కోపాన్ని రైతులపై చూపిస్తే ఎలా? అని ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ వాణీదేవిలు ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను మూలనపడేసే కుట్రలు చేయడం దుర్మార్గమని విమర్శించారు. పార్టీలో చేరికలపై కాకుండా పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎండలకు పంటలు ఎండిపోతున్నాయని, ఎండిన పంటలకు పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యాసంగి ధాన్యాన్ని క్వింటాలకు రూ.500 బోనస్ ఇచ్చి కొనాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రం థాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీ కృపేశ్, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మహేశ్వరం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్ లావణ్యారాజు, మాజీ సర్పంచ్ సురేశ్, సప్పిడి లావణ్య, శ్రీలత, ప్రవీణ్, మధు, రాంరెడ్డి, నర్సింహ, ప్రవీణ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

## రూ.500 బోనస్ ఇవ్వాలి

### వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ శ్రేణులు

వికారాబాద్, ఏప్రిల్ 2 : రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని వికారాబాద్, పరిగి మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి యాసంగి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన పంటలను అంచనా వేసి ఎకరాకు రూ.25000 నష్టపరిహారం చెల్లించాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలున్నారు.



వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి

## ఎన్నికల వేళ.. నిఘా నిరంతరం..

- మద్యం, నగదు అక్రమ రవాణా అడ్డుకట్టకు విస్తృతంగా తనిఖీలు
- ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక జిల్లాలో రూ.83.41లక్షల నగదు సీజ్
- రూ.3.04కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్..మరో రూ.50లక్షల విలువ గల వెండి, మద్యం కూడా..

రంగారెడ్డి, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల సమరానికి అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నది. ఇందుకు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసింది. నగదు అక్రమ రవాణా, మద్యం పంపిణీ ఇతర వాటికి అడ్డుకట్ట వేస్తూ.. గత కొద్దిరోజులుగా తనిఖీలను అధికారులు ముమ్మరం చేశారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లోనూ చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటివరకు రూ.83.41లక్షల నగదుతో కలిపి మొత్తం రూ.4.39కోట్లు విలువజేసే వెండి ఆభరణాలు, మద్యం, డ్రగ్స్ తనిఖీ బృందాలకు పట్టుబడ్డాయి.

### అక్రమ రవాణాపై దృష్టి..

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వెలువడనుంది. మే 13న పోలింగ్ ఉంటుంది. ఈ మధ్యకాలంలో నగదు, మద్యం తదితర రవాణా ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నది. ఓటర్లను ప్రలోభపెట్టడంలో భాగంగా రాజకీయ పార్టీలు నగదు, మద్యం తదితర వాటిని అక్రమ మార్గంలో తరలించకుండా ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్స్ సర్వేలైన్స్ బృందాలు తనిఖీలను ముమ్మరం చేశాయి. కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్ సైతం ఈ బృందాలపై ఎప్పటికప్పుడే ప్రత్యేక పర్యవేక్షణ ఉంచుతున్నది. జిల్లాకు నలుమూలల ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.




### 15 రోజుల వ్యవధిలో..

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి తనిఖీలు నిర్వహించి ఎటువంటి రసీదు లేని వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. అలాగే బ్యాంకు లావాదేవీలపై నిఘా ఉంచుతున్నారు. రూ.10లక్షలకు పైగా డబ్బు పట్టుబడిన సందర్భంలో ఆదాయ శాఖ అధికారులకు సమాచారం అందజేస్తున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలను చూపించి పట్టుబడిన నగదు, బంగారం, వెండి తదితర వాటిని తిరిగి పొందేందుకు జిల్లా కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశారు.

- జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో బిల్లులేకుండా తరలిస్తున్న రూ.83,41,650లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.
- ఎలాంటి బిల్లులేకుండా తరలిస్తున్న రూ.4,18,700 విలువైన 5.30 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.
- మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలపై దాడులు చేసి రూ.45,70,448లక్షల విలువ గల 7,798.49 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు.
- మరో రూ. 3,04,95,325 విలువగల 713.285 కిలోల డ్రగ్స్, నార్కోటిక్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వీటితోపాటు రూ.1.42లక్షల విలువగల ఇతర వస్తువులను సీజ్ చేశారు.

## రిజిస్ట్రేషన్ల శాఖకు భారీగా రెవెన్యూ

### ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4482 కోట్ల రాబడి

### గతేడాదితో పోలిస్తే రూ.621 కోట్ల ఆదాయం అధికం

వికారాబాద్, ఏప్రిల్ 2, (నమస్తే తెలంగాణ): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖకు 2023-24 ఆర్థిక సంవత్సరం కాసుల పంట పండింది. ఈ ఏడాది జిల్లాలో వ్యవసాయేతర భూముల క్రయవిక్రయాలతో రూ.4482 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరింది. అత్యధికంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారానే అధిక ఆదాయం సమకూరింది. అయితే ప్రతి ఆర్థిక సంవత్సరం చివర్లో అత్యధిక రిజిస్ట్రేషన్లు జరుగుతున్న దృష్ట్యా గత మార్చి నెలలో కూడా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయేతర భూముల క్రయవిక్రయాలతో రూ.446 కోట్లకుపైగా రెవెన్యూ సమకూరింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.621 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది సెప్టెంబర్ నుంచి అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు మాత్రం పెరుగడం గమనార్హం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేగంగా పారిశ్రామికాభివృద్ధి, రీజినల్ రింగ్‌రోడ్డు, అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రోడ్డుగా బీజాపూర్ జాతీయ రహదారిని విస్తరించడం, మోమిన్‌పేటలో 1200 ఎకరాల్లో మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేస్తుండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీగా లే అవుట్లు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ ప్రజలు చాలా వరకు శంకర్‌పల్లి, మొయినాబాద్, వికారాబాద్ వరకు నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతుండడంతో వ్యవసాయ భూములతోపాటు వ్యవసాయేతర భూముల క్రయవిక్రయాలు భారీగా పెరిగాయి.

### రూ.4482 కోట్ల ఆదాయం..

జిల్లాలోని వ్యవసాయేతర భూముల క్రయవిక్రయాల ద్వారా జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖకు 2023-24 ఆర్థిక సంవత్సరం రూ.4482.64 కోట్ల రెవెన్యూ వచ్చింది. అత్యధికంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.1276.97 కోట్ల రాబడి వచ్చింది. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అత్యధికంగా రెవెన్యూ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం అనంతరం గండిపేట, శేరిలిగంపల్లి, మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధిక రెవెన్యూ ప్రభుత్వ ఖజానాకు చేరింది. జిల్లావ్యాప్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 2,48,033 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు అయ్యాయి. ప్రభుత్వ ఖజానాకు చేరిన ఆదాయాన్ని పరిశీలిస్తే.. చేవెళ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.99.47 కోట్లు, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ ద్వారా రూ.1276.97 కోట్లు, రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ ద్వారా రూ.350.45 కోట్లు, శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ ద్వారా రూ.78.65 కోట్లు, శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్ ద్వారా రూ.447.41 కోట్లు, శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ ద్వారా రూ.104.94 కోట్లు, గండిపేట సబ్ రిజిస్ట్రార్ ద్వారా రూ.852.37 కోట్లు, ఎల్‌బీనగర్ సబ్ రిజిస్ట్రార్ ద్వారా రూ.153.68 కోట్లు, అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్ ద్వారా రూ.38.02 కోట్లు, వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ ద్వారా రూ.137.08 కోట్లు, చంపాపేట్ సబ్ రిజిస్ట్రార్ ద్వారా రూ.144.96 కోట్లు, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ ద్వారా రూ.103.12 కోట్లు, షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ ద్వారా రూ.63.65 కోట్లు, సరూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ ద్వారా రూ.125.45 కోట్లు, ఫరూఖ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.90.91 కోట్లు, మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.210.06 కోట్లు, పెద్ద అంబర్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.81.58 కోట్లు, హయత్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.66.25 కోట్లు, కొడంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.2.08 కోట్లు, పరిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.9.26 కోట్లు, తాండూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.10.74 కోట్లు, వికారాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.35.44 కోట్ల రెవెన్యూ వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఖజానాలో జమైంది. ఆర్థిక సంవత్సరం చివరి నెల మార్చిలో అత్యధికంగా రూ.446 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది.

### 2,48.033 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్..

జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 2,48,033 డాక్యుమెంట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు అయ్యాయి. కొడంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 1455 డాక్యుమెంట్లు, షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 8683, ఫారూఖ్‌నగర్‌లో 17041, చేవెళ్లలో 9211, హయత్‌నగర్‌లో 7321, ఇబ్రహీంపట్నంలో 17,420, పరిగిలో 2778, తాండూరులో 4035, వికారాబాద్‌లో 6955, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో 24,367 డాక్యుమెంట్లు, సరూర్‌నగర్‌లో 8146, చంపాపేట్‌లో 15,298, పెద్ద అంబర్‌పేటలో 10,032, రాజేంద్రనగర్‌లో 13,179, మహేశ్వరంలో 21,596 డాక్యుమెంట్లు, శంషాబాద్‌లో 9984, శేరిలింగంపల్లిలో 13,037, శంకర్‌పల్లిలో 5695, గండిపేట్‌లో 16,941 డాక్యుమెంట్లు, వనస్థలిపురంలో 14,334, ఎల్‌బీనగర్‌లో 12,622, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 7903 డాక్యుమెంట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు అయ్యాయి.

